క్లుప్తంగా

80 శాతం సర్వే పూర్తి

చిలప్‌చెడ్ (నర్సాపూర్): చిలప్‌చెడ్ మండలంలో సుమారు 80 శాతం వరకు సమగ్ర కుటుంబ సర్వే పూర్తయిందని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని చండూర్ గ్రామంలో సర్వే కొనసాగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 6,155 కుటుంబాల సర్వే చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు ఐదు వేల కుటుంబాల సర్వే పూర్తయిందని, కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 22వ తేదీ వరకు సర్వే వందశాతం పూర్తి చేస్తామన్నారు. కుటుంబసభ్యులు ఎన్యూమరేటర్లకు పూర్తి సహకారం అందించాలని కోరారు.

ఘనంగా రామాలయం వార్షికోత్సవం

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని ఉప్పులింగాపూర్‌లో రామాలయం నాల్గవ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య గణపతి హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో ఆలయ పరిసరాలు రామనామ స్మరణతో మారుమోగింది. భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు అన్న ప్రసాద వితరణ చేపట్టారు.

విద్యార్థుల ఉన్నతికి తల్లిదండ్రులు సహకరించాలి

వెల్దుర్తి(తూప్రాన్): విద్యార్థుల ఉన్నతికి తల్లిదండ్రులు ప్రోత్సహించాలని శ్రీ రాయరావు సరస్వతి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం కళాశాలకు గైర్హాజరైన మండలంలోని ఉప్పులింగాపూర్, రామాయిపల్లి గ్రామాల్లోని విద్యార్థుల ఇళ్ల వద్దకు అధ్యాపకులు వెళ్లి తమ పిల్లలను ప్రతిరోజూ పంపించాలని సూచించారు. ఈ నెల 18 నుంచి ఇంటర్మీడియెట్ బోర్డు ఆదేశాల మేరకు అర్ధ వార్షిక పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

రోడ్డు ప్రమాదం.. ఇద్దరికి తీవ్రగాయాలు

చిన్నశంకరంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన నార్సింగి మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. మండలంలోని జప్తిశివనూర్ గ్రామానికి చెందిన నాగరాజు, సురేష్ నార్సింగి వచ్చి తిరిగి వెళుతుండా వీరి బైక్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టింది. దీంతో వాహనం అదుపు తప్పి రోడ్డుపై పడిపోయారు. తీవ్రంగా గాయపడిన 108 అంబులెన్స్‌లో రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వరిధాన్యం పరిశీలించిన ఏఈఓ



కౌడిపల్లి: దేవులపల్లిలో సన్నరకం వరిధాన్యం పరిశీలిస్తున్న ఏఈఓ సాహితి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని దేవులపల్లిలో సన్నరకం వరిధాన్యాన్ని ఏఈఓ సాహితి బుధవారం పరిశీలించారు. దేవులపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ఏర్పాట్లు చేశారు. ఇప్పటివరకు సన్నరకం వరిధాన్యం తూకం వేయలేదు. వెంటనే తూకం ప్రారంభించాలని చెప్పారు. రైతులు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వ ఆదేశాల మేరకు సన్నరకం వరిధాన్యం తూకం వేయనున్నట్లు చెప్పారు.

గర్భకోశ వ్యాధి ప్రబలకుండా జాగ్రత్తలు

- మండల పశువైద్యాధికారి మౌనిక



రైతులకు అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారిణి మౌనిక

నిజాంపేట(మెదక్): జిల్లా పశుగణాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో పశుసంవర్థక శాఖ సహకారంతో నిజాంపేట, నస్కల్ గ్రామాలలో బుధవారం గర్భకోశ వ్యాధి నివారణ చికిత్సలు, గాలికుంటు వ్యాధి శిబిరాన్ని మండల పశువైద్యాధికారి డాక్టర్ మౌనిక ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడి పశువులకు గర్భకోశ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పశువుల ఎద లక్షణాలు గుర్తించి చుడి కట్టే విధంగా చూడాలని సూచించారు. లేగ దూడల్లో నట్టల నివారణ మందులు తాగించడం వల్ల దూడలు ఎదుగుతాయని పేర్కొన్నారు. గోపాల మిత్రుల ద్వారా ఎద సూది వేయించడం వల్ల మేలు జాతి దూడలు జన్మిస్తాయని చెప్పారు. పశువైద్య సిబ్బంది, గోపాల మిత్రులు స్వామి, బాబు, శ్రీకాంత్, కర్రయ్య, అంజయ్య, శంకరయ్య, అంజయ్య, రాజు, స్వామి పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు



చేగుంట: గిరిజన నాయకులను ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు



మనోహరాబాద్: గిరిజన నాయకులను ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు



కౌడిపల్లి: పోలీస్‌స్టేషన్‌లో బీఆర్‌ఎస్ గిరిజన నాయకులు

వికారాబాద్ జిల్లా లగచర్లలో గిరిజనులకు మద్దతు తెలిపేందుకు వెళుతున్న జిల్లాకు చెందిన బీఆర్‌ఎస్ గిరిజన నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఆయా పోలీస్‌స్టేషన్ పరిధిలో వారిని అదుపులోకి తీసుకున్నారు. లగుచర్లకు వెళ్లకుండా ఎక్కడికక్కడ అడ్డుకున్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయులు

మనోహరాబాద్(తూప్రాన్): మాదక ద్రవ్యాల నిర్మూలనపై మండలంలోని కాళ్లకల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామంటూ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఇన్‌చార్జి హెచ్‌ఎం స్వరూప మాట్లాడుతూ.. యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. మాదక ద్రవ్యాలతో అనారోగ్యం పాలై జీవితం అంధకారం అవుతుందన్నారు. యువత చదువుతో పాటు క్రీడలపై మక్కువ పెంచుకోవాలని, క్రమ శిక్షణతో కూడిన చదువు వల్ల భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని చెప్పారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



చెక్కు అందజేస్తున్న సిద్ధరాములు

రామాయంపేట(మెదక్): మండలంలోని కోనాపూర్‌లో బుధవారం సహకార సంఘం డైరెక్టర్ సిద్దరాములు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. గ్రామానికి చెందిన చిగుల్ల భాగ్య, పెద్ద తండాకు చెందిన భాస్కర్‌కు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సీఎంఆర్‌ఎఫ్ పథకం కింద నిధులు మంజూరు చేయించారు. ఈ మేరకు సిద్దరాములు బుధవారం వారికి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సతీశ్, అంజయ్య, మహేందర్, బన్నీ, తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్ క్యాంపు కార్యాలయంలో..

చిలప్‌చెడ్(నర్సాపూర్): నర్సాపూర్‌లోని క్యాంపు కార్యాలయంలో చిలప్‌చెడ్ మండలం గౌతాపూర్ గ్రామానికి చెందిన ఎస్.మాణిక్యరెడ్డికి రూ.60 వేలు, నదరి బాగమ్మ రూ.18 వేలు, కుమ్మరి వీరమణి 16.5 వేలు, దరిపల్లి నర్సింలు రూ.15 వేలు, గుగ్లోత్ శివరాం 29.5 వేల చెక్కులను ఎమ్మెల్యే సునీతారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు విఠల్, భీమయ్య, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భద్రకాళి వీరభద్రుడి కల్యాణం



రేగోడ్ భద్రకాళి వీరభద్రుడి కల్యాణం మహోత్సవం దృశ్యం

రేగోడ్(మెదక్): మండల కేంద్రమైన రేగోడ్‌లోని గోకర్ణేశ్వర శివాలయంలో బుధవారం భద్రకాళి వీరభద్రుడి కల్యాణ మహోత్సవాన్ని దాతలు కల్లేటి అశోక్, మునిగ్యాల శ్రీనివాస్ కుటుంబీకుల సహకారంతో ఆలయ కమిటీ వేద పండితుడిచే ఘనంగా నిర్వహించారు. శివస్వాములు, అయ్యప్ప స్వాములు చేసిన శివనామస్మరణలతో ఆలయం మారుమోగింది. రేగోడ్, మర్పల్లి, పోచారం, కొండాపూర్, జగిర్యాల, చౌదర్‌పల్లి తదితర గ్రామాల నుంచి భక్తులు విచ్చేసి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు తీర్థ, అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు. కాగా పీసీసీ సభ్యుడు కిషన్, మాజీ జెడ్పీటీసీ యాదగిరి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.దిగంబర్‌రావు, మాజీ ఎంపీటీసీ ఎం.నరేందర్ భద్రకాళి వీరభద్రుడిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో పూజారి మహేశ్, మాజీ ఎంపీటీసీ గొల్ల నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



కళా ప్రదర్శన నిర్వహిస్తున్న కళాకారులు

ప్రభుత్వ పథకాలపై కళా ప్రదర్శన

హవేళిఘణాపూర్(మెదక్): రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రభుత్వ పథకాలను తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ప్రజాపాలన కళా ప్రదర్శనలను బుధవారం మండల కేంద్రమైన హవేళిఘణాపూర్‌లో నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పౌర సమాచార శాఖ, జిల్లా పౌర సంబంధిత అధికారుల సమన్వయంతో ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీ పథకాలపై కళా ప్రదర్శనలు నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి టీమ్ లీడర్ సిద్దులు, కళాకారులు పాల్గొన్నారు.

నేటి నుంచి లోక్‌మంథన్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న తపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): ఈ నెల 21 నుంచి 24 వరకు లోక్‌మంథన్ కార్యక్రమం జరుగుతుందని తపస్ జిల్లా మహిళ ఉపాధ్యక్షురాలు యెన్నం మాధవి తెలిపారు. బుధవారం చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లి జెడ్పీ పాఠశాలలో లోక్ మంథన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శిల్పారామంలో జరిగే ఈ కార్యక్రమంలో 1250 మంది ప్రజాప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. భారతదేశంలోని విభిన్న సంస్కృతి సంప్రదాయ కళలు ఈ కార్యక్రమంలో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, మంగరాణి, రాజేష్, సమినా తదితరులు పాల్గొన్నారు.

నిందితుడు తప్పుదోవ పట్టించారు

- చనిపోయిన వ్యక్తిపై కేసు ఆరోపణల్లో వాస్తవం లేదు
- సీఐ జాన్‌రెడ్డి స్పష్టీకరణ



మాట్లాడుతున్న సీఐ జాన్‌రెడ్డి, పక్కన ఎస్‌ఐ లింగం

నర్సాపూర్: చనిపోయిన వ్యక్తిపై కేసు నమోదు చేశారన్న నిందితుల ఆరోపణల్లో వాస్తవం లేదని సీఐ జాన్‌రెడ్డి చెప్పారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. మండలంలోని నారాయణపూర్ గ్రామ పంచాయతీలోని లచ్చిరాం తండాకు చెందిన దేవిసింగ్, ఆంజనేయులు చేస్తున్న ఆరోపణలలో, సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదన్నారు. నారాయణపూర్ గ్రామ పరిధిలో తాను భూమి కొనుగోలు చేశానని, అయితే.. దేవిసింగ్, సూర్య, ఆంజనేయులు, విఠల్ ఆ భూమి ఆక్రమిస్తున్నారని నర్సాపూర్‌కు చెందిన శ్రీనివాస్ సెప్టెంబరు 23న ఫిర్యాదు చేశారని తెలిపారు. అదేరోజు నర్సాపూర్ ఎస్‌ఐ లింగం విచారణ చేసి కేసు నమోదు చేశారన్నారు. తాము విచారణ చేసినప్పుడు విఠల్ వేరే గ్రామానికి వెళ్లాడని అతని కుమారుడు ఆంజనేయులు సమాచారం ఇచ్చి తమను తప్పుతోవ పట్టించాడని సీఐ తెలిపారు. దీంతో చనిపోయిన విఠల్ పేరు సైతం ఎఫ్‌ఐఆర్‌లో చేర్చామని, తర్వాత తమకు విఠల్ చనిపోయాడని తెలిసిందని, కోర్టుకు చార్జిషీట్ సమర్పించే సమయంలో విఠల్ పేరు తొలగిస్తామని సీఐ చెప్పారు. దేవిసింగ్‌తో పాటు ఇతరులు నారాయణపూర్‌లోని భూమి ఆక్రమణకు పాల్పడలేదని తమ విచారణలో తేలితే కేసును మూసి వేస్తామన్నారు. సదరు భూమికి సంబంధించిన ఆధారాలు ఉంటే కోర్టులో లీగల్‌గా తేల్చుకోవాలని తాము దేవిసింగ్‌కు సూచించామని, ఎక్కడా ఏకపక్షంగా వ్యవహరించలేదని స్పష్టం చేశారు. నిబంధనల మేరకు తాము చర్యలు తీసుకున్నామని సీఐ తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ లింగం పాల్గొన్నారు.

‘స్థానిక’ ఎన్నికల్లో సత్తా చాటాలి

బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జి చంద్రయ్య



సమావేశంలో పాల్గొన్న చంద్రయ్య, ఇతర నాయకులు

నర్సాపూర్ రూరల్: స్థానిక సంస్థ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని ఆ పార్టీ మెదక్ ఎన్నికల ఇన్‌చార్జి చంద్రయ్య అన్నారు. బుధవారం నర్సాపూర్ జరిగిన మండల, బూత్ కమిటీల వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని, వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో సత్తా చాటాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి స్థాయిని మరిచి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఏడాది పాలన ఉత్సవాలను జరుపుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. రుణమాఫీ, డబుల్ బెడ్ రూమ్, మహిళలకు రూ 2,500 వంటి హామీలను విస్మరించిందన్నారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి చెందడం ఖాయమన్నారు. అనంతరం సభ్యత నమోదుపై చర్చించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్ యాదవ్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గోడ రాజేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్న రమేష్ గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ హెచ్‌వీ రమణారావు, కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా సర్వే చేయాలి



కౌడిపల్లి: జాజితండాలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీఓ కలీముల్లా

కౌడిపల్లి(నర్సాపూర్): తప్పులు లేకుండా సర్వే చేయాలని ఎంపీఓ కలీముల్లా తెలిపారు. బుధవారం మండలంలోని జాజితండాలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్యూమరేటర్లు ఎలాంటి తప్పులు లేకుండా సర్వే చేయాలని కోరారు. ప్రతి రోజు సర్వే రిపోర్టు అధికారులకు తెలియజేసి సర్వే పత్రాలు జాగ్రత్తగా ఉంచాలన్నారు. సర్వేలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. మండలంలో ఇప్పటి వరకు 7,500 కుటుంబాలు సర్వే చేయడం పూర్తి అయిందన్నారు.

క్రమశిక్షణతోనే లక్ష్యం సాధ్యం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ

చిలప్‌చెడ్(నర్సాపూర్): విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటేనే అనుకున్న లక్ష్యం సాధించగలుగుతారని చిలప్‌చెడ్ మండల విద్యాధికారి విఠల్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని సోమక్కపేట ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవానికి ఎంఈఓ విఠల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల హక్కుల గురించి వివరించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. చదువుతో పాటు క్రీడలు, తదితర రంగాలలో ఉత్తమ ప్రతిభ కనబరచాలని కోరారు. మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదన్నారు. మొబైల్, ఇంటర్నెట్ అవసరానికి మించి వాడకూడదని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంజేపీలో గ్రంథాలయ వారోత్సవాలు



తునికి ఎంజేపీలో పుస్తక ప్రదర్శనను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ హరిబాబు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి వద్దగల ఎంజేపీ (మహాత్మ జ్యోతిబాపూలే) బీసీ గురుకుల పాఠశాలలో బుధవారం గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల లైబ్రరీయన్ పుష్ప ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన నిర్వహించగా ప్రిన్సిపాల్ హరిబాబు, ఉపాధ్యాయులు, లెక్చరర్లు, విద్యార్థులు పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పాఠశాల గ్రంథాలయంలో జేఈఈ, ఎంసెట్, నీట్ తదితర పోటీ పరీక్షల పుస్తకాలతో పాటు డిక్షనరీ ఇతర పుస్తకాలు ఉన్నాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏటీపీ సుష్మ, డిప్యూటీ వార్డెన్ లక్ష్మణ్, సీనియర్ లెక్చరర్ విక్రమ్, అలివేణి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

బీఆర్‌ఎస్ అధ్యక్షురాలు పద్మారెడ్డి డిమాండ్



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పద్మ

మెదక్ మున్సిపాలిటీ: ఈనెల 19న హవేళిఘనాపూర్ మండలం ఫరీద్‌పూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో జక్కన్నపేట గ్రామానికి చెందిన ప్రభాకర్, మహేశ్ దుర్మరణం పాలయ్యారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అంతకు ముందు మెదక్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో మృతదేహాలను సందర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. చిన్న వయసులో ఇద్దరు యువకులు మరణించడం చాలా బాధాకరమన్నారు. వీరి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వీరి వెంట మెదక్ పట్టణ బీఆర్‌ఎస్ కన్వీనర్, మున్సిపల్ కౌన్సిలర్ ఆంజనేయులు, జక్కన్నపేట మాజీ సర్పంచ్ చామంతుల సత్యనారాయణ ఉన్నారు.

టోర్నమెంట్‌ను విజయవంతం చేయండి

టేక్మాల్(మెదక్): టేక్మాల్ మండలం కాద్లూర్ గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగి బొంపల్లి రాజయ్య స్మారక ఉమ్మడి మెదక్ జిల్లా వాలీబాల్ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షులు నిమ్మ రమేష్ కోరారు. బుధవారం టేక్మాల్ వాలీబాల్ టోర్నమెంట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. వచ్చే నెల 4 నుంచి 6వ తేదీ వరకు టోర్నమెంట్ కొనసాగుతోందని చెప్పారు. ఎటువంటి ఎంట్రీ ఫీజు లేకుండా ఈనెల 30వ తేదీ వరకు తమ జట్టుల వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రథమ బహుమతి రూ.20,116, ద్వితీయ బహుమతి రూ.10,116, తృతీయ బహుమతి రూ.5,116లతో పాటు మెమెంటోలు అందిస్తారన్నారు. క్రీడాకారులకు భోజన సౌకర్యం ఉందన్నారు. టోర్నమెంట్‌కు ముఖ్య అతిథులుగా మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్ రానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోగిపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, కాంగ్రెస్ మెదక్ డిస్ట్రిక్ మైనారిటీ ప్రెసిడెంట్ షేక్ మజహర్, మాజీ సర్పంచ్ పాపయ్య, ఎస్టీ సెల్ అధ్యక్షుడు సేవాలాల్, నాయకులు నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

తప్పులు లేకుండా సర్వే చేయాలి



శివ్వంపేట(నర్సాపూర్): ఇంటింటి సమగ్ర సర్వేను ప్రభుత్వం నిర్దేశించిన విధంగా తప్పులు లేకుండా సర్వే చేయాలని ఎంపీడీఓ నాగేశ్వర్ అన్నారు. మండల వ్యాప్తంగా ముమ్మరంగా ఇన్యుమనేటర్లు ఇంటింటి సర్వే చేస్తున్నారు. బుధవారం నిర్వహించిన సర్వే తీరును గోమారంతో పాటు పలు గ్రామాల్లో అయన పరిశీలించారు. ఎంపీఓ తిరుపతిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సర్వేను పరిశీలించిన తహసీల్దార్

చిన్నశంకరంపేట(మెదక్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కులగణన సర్వేకు ప్రజలు సహకరించాలని తహసీల్దార్ మన్నన్ కోరారు. బుధవారం మండలంలోని మిర్జాపల్లి తండాలో సమగ్ర కుల గణన సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర కుల గణన సర్వేను వేగవంతం చేయాలని కోరారు. సర్వే పూర్తి చేసేందుకు ప్రజలు సహకరించి తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

గ్రామాల్లో వైద్యపరీక్షలు

అక్కన్నపేట(హుస్నాబాద్): కార్మిక శాఖ ఆధ్వర్యంలో లెబర్‌కార్డులు కలిగివున్న వారందరికీ ఉచితంగా వైద్యపరీక్షలను నిర్వహించారు. బుధవారం అక్కన్నపేట మండలం రామవరం, దాస్‌తండా గ్రామాల్లో స్టాఫ్‌నర్సు అలీయాబేగం, ల్యాబ్ టెక్నీషియన్ మహమ్మద్ జీషాలు 25 మంది రోగులకు పరీక్షలు చేశారు. రిపోర్టులను 10 రోజుల వ్యవధిలో సెల్‌ఫోన్‌లకు పంపుతామన్నారు. లెబర్‌కార్డు కలిగి ఉన్న వారికి ఏడాదిలో ఒక సారి ఉచితంగా వైద్యపరీక్షలను చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని లెబర్‌కార్డులు కలిగి ఉన్న వారందరూ ఉపయోగించుకోవాలన్నారు.

రైతులకు ఇబ్బందులు కల్గించవద్దు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మన్నన్



గంగాయిపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి

చిన్నశంకరంపేట: ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్ మన్నన్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఏసీఎస్ కొనుగోలు కేంద్రం నుంచి ఇప్పటి వరకు 12 లారీల ధాన్యం రైస్ మిల్లులకు తరలించినట్లు తెలిపారు. రైస్‌మిల్లుల్లో కూడా ధాన్యాన్ని వెంటనే దించేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రెవెన్యూ సిబ్బంది ఎప్పటికప్పుడు రైస్‌మిల్లుల వద్ద పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తితే తమను సంప్రదించాలని కోరారు.

ఇబ్బందులు లేకుండా చూడాలి

శివ్వంపేట(నర్సాపూర్): కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని మండల ప్రత్యేక అధికారి ప్రతాప్‌సింగ్ అన్నారు. బుధవారం మండలంలోని గంగాయిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని సకాలంలో తూకం వేసి రైస్‌మిల్లులకు తరలించాలని కోరారు. రైతుల వివరాలు ఆన్‌లైన్ నమోదు చేసి వారి ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ తిరుపతిరెడ్డి, తదితరులు ఉన్నారు.